# పత్తి పంటలో రసం పీల్చే పురుగులపై అప్రమత్తంగా ఉండాలి

## -- మండల వ్యవసాయ అధికారి ఎస్. కరుణాకర్

**బిఎన్ఎస్ న్యూస్ స్టేషన్ ఘనపూర్ సెప్టెంబర్ 05**



పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. కరుణాకర్ సూచించారు. స్టేషన్ ఘనపూర్ మండలంలో ఆయన వ్యవసాయ విస్తరణ అధికారి అనితతో కలిసి పత్తి పొలాలను సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటలో పేనుబంక, పచ్చదోమ, తామర పురుగులు ఉన్నట్లు గుర్తించారు. వీటి కారణంగా పంటకు కలిగే నష్టం, పురుగుల ఉనికిని గుర్తించే లక్షణాలు, నివారణ చర్యలను రైతులకు వివరించారు. పురుగుల ఉధృతి అధికంగా ఉన్నప్పుడు వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన ఫ్లోనికామిడ్, ఎసిటామిప్రిడ్, డైనోటెఫ్యూరాన్, స్పినెటోరామ్ లేదా ఫిప్రోనిల్ మందులను మందు సీసాపై సూచించిన మోతాదు ప్రకారం మాత్రమే పిచికారీ చేయాలని సూచించారు. ఒకే రకమైన పురుగు మందును పదేపదే ఉపయోగించకుండా, వేర్వేరు చర్యా విధానాలు కలిగిన మందులను మార్చి వాడాలని తెలిపారు. అలాగే అవసరం లేకుండా వివిధ రకాల పురుగు మందులను కలిపి పిచికారీ చేయరాదని రైతులకు సూచించారు. పంటలో పురుగుల ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ, సమస్య తీవ్రతను బట్టి వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని మందులను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి ఎస్. కరుణాకర్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# మందుబాబులకు నిలయంగా జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం.!!

- అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి.
- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 05: జమ్మలమడుగు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వెనుక భాగంలోని కాళీ ప్రాంగణం నందు మందు బాబులకు అడ్డాగా ఉంటూ నిలయంగా మారిందని అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, వాటిని పునరావృతం కాకుండా అరికట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శనివారం నాడు ఆర్డీవో కార్యాలయం వెనుక భాగాన మందు సీసాలు, సిగరెట్, బీడీ పీకలను పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయం వద్దనే ఇలా మందుబాబులకు నిలయంగా ఉంటే ఎలా అన్నారు. అధికారులు నిరంతర పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. బయటినుండి వచ్చిన అర్జిదారులకు ప్రత్యేకంగా కూర్చోవడానికి చర్యలు చేపట్టాలని ఆర్డీవో కార్యాలయ పరిసర ప్రాంతంలో బీడీలు, సిగరెట్లు తాగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్డీవో కార్యాలయ వెనుక భాగాన మందు, సిగరెట్లు, బీడీలు వంటివి తాగకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నామని తెలిపారు. ఒకవేళ సంబంధిత అధికారులు చర్యలు లేకుంటే డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రసాద్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సుబహాన్, అరుణ్ పాల్గొన్నారు.

# యువత రక్తదానంపై ఉన్న అపోహలని తుడిచి పెట్టాలి..!

## జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవ సమితి.

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా సెప్టెంబర్ 05: ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల అనారోగ్యం మరియు అస్వస్థత పరిస్థితి ఎక్కువ కావడంతో రక్తం కొరత ఎక్కువ అవుతుందని యువత దృష్టిలో ఉంచుకొని రక్తదానం చేసేందుకు ఎన్నడూ వెనకడుగు వేయకూడదని ముఖ్య అతిథిగా పాల్గొన్న గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అన్నారు. స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త వారోత్సవాలో భాగంగా రెండవ రోజు జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవ సమితి ఆధ్వర్యంలో మైదుకూరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ మరియు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు పైబడిన యువతీ, యువకులు ఎవరైనా రక్తదానం చేయొచ్చు అని రక్తదానం చేయడం ద్వారా స్వీయ ఆరోగ్యం మెరుగవుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవ సమితి వ్యవస్థాపకుడు ఎం అశోక్ మాట్లాడుతూ.. ఈ రక్తం నిలువలు లేని సమయంలో వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించాలని అడిగినప్పుడు మనస్ఫూర్తిగా ముందుకు రావడం కళాశాల గొప్పదనం అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. యువత రక్త దానం చేయడం వల్ల పాత కణాలు మరియు పాత రక్తం పోయి కొత్త రక్తం రావడంతో చురుగ్గా శరీరం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కే గుర్రప్ప మాట్లాడుతూ.. రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అనే నినాదంతో స్వచ్ఛంద సంస్థలు ఇంతటి గొప్ప కార్యక్రమం చేపట్టడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, సంస్థ సభ్యులు చారి, లేఖన్, అఖిలేష్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ఘనవిజయం చేశారు.



# ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన గ్రామ ప్రముఖులు

**బిఎన్ఎస్ న్యూస్ జనగామ సెప్టెంబర్ 05**




ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎర్రగొల్లపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చిర్ర సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ భైరగోని చంద్రం, మాజీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మెరుగు శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బి. హరిలాల్, బి. వాణిశ్రీ, ఎస్. సత్తయ్య, చె. శారద, పి. రామ్మోహన్, టి. జంపయ్య, ఆర్. సుధీర్‌బాబు, ఎ. సత్తిరెడ్డి, డా. బి. భాస్కర్ తదితరులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తమను సన్మానించిన గ్రామ సర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రముఖులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంఈఓ పోతుగంటి నర్సయ్య కుమార్తె మృతి

**బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి, సెప్టెంబర్ 5**



జనగామ జిల్లా పాలకుర్తి మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య కుమార్తె జాగిల్లాపురం రమాదేవి (38) అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రమాదేవి మృతి విషయం తెలుసుకున్న పాలకుర్తి మేజర్ గ్రామపంచాయతీ 2వ వార్డు సభ్యులు మామిండ్ల కవిత శోభన్ బాబు, 11వ వార్డు సభ్యులు కమ్మగాని శ్రీకాంత్ గౌడ్ ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# శ్రీ విద్యారణ్య స్కూల్ ప్రిన్సిపాల్‌కు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు'

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



బిఎన్ఎస్: విద్యా రంగానికి విశేష సేవలందించిన బండ్లగూడలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమా విశ్వనాథన్ ప్రతిష్టాత్మక 'శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు'కు ఎంపికయ్యారు. బోధనా రంగంలో ఆమె చూపిన ప్రతిభ, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రకటించారు.

ఇటీవల నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఆమె ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.

ఈ సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ రమా విశ్వనాథన్ కు అత్యంత వైభవంగా ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమెను ఘనంగా సత్కరించారు.



పాఠశాల కార్యదర్శి విశ్వేశ్వరరావు చేతుల మీదుగా రమా విశ్వనాథన్ ను శాలువా, జ్ఞాపికతో ఆత్మీయంగా సన్మానించారు.

కార్యదర్శి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. రమా విశ్వనాథన్ నేతృత్వంలో పాఠశాల విద్యా ప్రమాణాల్లో ఎంతో పురోగతి సాధించిందని కొనియాడారు. హ

కమిటీ సభ్యులు వెంకటస్వామి, పూర్వ విద్యార్థి పరిషత్ నాయకులు రాజిరెడ్డి మాట్లాడుతూ, రమా విశ్వనాథన్ కు సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు రావడం పాఠశాల ఘనతను మరింత పెంచిందన్నారు



అనంతరం శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అత్యంత కోలాహలంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయుల కోసం వివిధ రకాల క్రీడలు, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులందరూ ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కలసి ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా 'గౌరవ వందనం' సమర్పించారు.

ఉపాధ్యాయులు సమాజానికి చేస్తున్న సేవలను స్మరించుకుంటూ విద్యార్థులు వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

చివరగా, ప్రిన్సిపాల్ రమా విశ్వనాథన్ మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడం తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. తన విజయంలో భాగస్వాములైన పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

## ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలి
## బడీడు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలి: సర్పంచ్ విజయలక్ష్మి

**బిఎన్ఎస్ వాజేడు, ములుగు సెప్టెంబర్ 05:**



ములుగు జిల్లా వాజేడు మండలం దూలాపురం గ్రామ పరిధిలోని పాయబాటల ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందజేసిన ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. దూలాపురం గ్రామ సర్పంచ్ యాలం విజయలక్ష్మి, ఉపసర్పంచ్ బొల్లె రామకృష్ణ విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి సంవత్సరం ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా బడీడు వయస్సు ఉన్న ప్రతి చిన్నారిని తల్లిదండ్రులు తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుటూరి సతీష్ కుమార్, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# "మిషన్ ఉంది.. పేపర్ లేదు --- ఐటీడీఏలో నిధుల వినియోగం ఎక్కడ?"

## "అడిగితే అరకొర సమాధానం.. ప్రజల పనులకు మాత్రం అడ్డంకులు --- అధికారులు స్పందించాలి"
## "ఇంట్లో దీపం వెలిగించి.. బయట చీకటి పెట్టిన చందంగా ఐటీడీఏ తీరు --- ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి"




**బిఎన్ఎస్, ఏటూరునాగారం, సెప్టెంబర్ 05:**

ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయానికి వివిధ ప్రభుత్వ పనుల నిమిత్తం వచ్చే గిరిజనులు, ప్రజలకు అవసరమైన పత్రాలను జిరాక్స్ లేదా ప్రింట్ తీసి ఇవ్వాల్సిన పరిస్థితుల్లో కార్యాలయంలో జిరాక్స్ ప్రింటింగ్ మిషన్ ఉన్నప్పటికీ వైట్ పేపర్లు అందుబాటులో లేవని సిబ్బంది సమాధానం చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయంలో కనీసం జిరాక్స్ పేపర్లు కూడా అందుబాటులో లేకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏకు ప్రభుత్వం నుంచి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం నిధులు మంజూరవుతున్నప్పటికీ, కార్యాలయంలో అత్యవసరమైన స్టేషనరీ సామగ్రి అందుబాటులో లేకపోవడం పట్ల ప్రజలు ప్రశ్నలు సంధిస్తున్నారు. "గుడ్డి కన్నుకు కనబడదు.. చెవిటి చెవికి వినబడదు" అన్న చందంగా ప్రజల ఇబ్బందులను అధికారులు పట్టించుకోకుండా ఉండకూడదని కోరుతున్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, దరఖాస్తులు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని జిరాక్స్ లేదా ప్రింట్ తీసుకోవాల్సిన సందర్భాల్లో పేపర్లు లేవని చెప్పడం వల్ల ప్రజలు బయట ప్రైవేట్ జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే గిరిజనులు ఒక్కో పనికి పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "చేతిలో ఉన్న గూటిని వదిలి.. పక్కింటి గూటి కోసం వెతికినట్లు" ప్రజల కోసం అందుబాటులో ఉన్న జిరాక్స్ మిషన్‌ను వినియోగించుకోలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. కార్యాలయ నిర్వహణకు అవసరమైన వైట్ పేపర్లు, ఇతర స్టేషనరీ సామగ్రి కొనుగోలుకు కేటాయించే నిధులు, వాటి వినియోగంపై పారదర్శకత ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ఐటీడీఏకు వస్తున్న నిధుల వినియోగం, కార్యాలయ నిర్వహణ ఖర్చులు, స్టేషనరీ కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించాలని, వాస్తవ పరిస్థితులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. "పొగ ఉన్న చోట నిప్పు లేకపోదు" అన్న సామెతలా వినిపిస్తున్న ఆరోపణలపై అధికారులు స్పందించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ఐటీడీఏ కార్యాలయంలో కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, జిరాక్స్ మిషన్‌కు అవసరమైన పేపర్లు, టోనర్ తదితర సామగ్రిని నిరంతరం అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

